ప్రజాశక్తి
మంగళవారం 23 మే 2023
5
శ్రీ సత్యసాయి

ఏపీ ఈఏపీసెట్-23

అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 43,929 మంది హాజరు

ప్రజాశక్తి-అనంతపురం

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో ప్రవేశానికి సోమవారం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-23 మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం, సాయంత్రం జరిగిన పరీక్షలకు 48,622 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 43,829 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు కలిపి 118 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, 90.35 శాతం హాజరు నమోదు అయ్యింది. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జెఎన్‌టియు విసి రంగజనార్ధన, పరీక్షల కన్వీనర్ శోభాబిందు తెలిపారు.

'విత్తు'కోసం వెతుకులాట..!

◆ కొనసాగుతున్న విత్తన రిజిస్ట్రేషన్లు ◆ నామమాత్రంగానే స్పందన

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే వర్షాలు పడుతుండటంతో రైతులు సేద్యానికి సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్నుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో విత్తన పంపిణీకి ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు ప్రారంభించింది. రిజిస్ట్రేషన్ సమయంలోనే డబ్బులు కూడా ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది. అటు వ్యవసాయ పనులకు, ఇటు విత్తన కొనుగోళ్లకు డబ్బులు అవసరమవడంతో రైతులు విత్తు కోసం వెతుకులాట మొదలు పెట్టారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. పోయిన సంవత్సరాల్లో అదేరకంగా ఇస్తూ వచ్చింది. గతేడాది అనంతపురం జిల్లా పరిధిలో 2,83,063 మందికి రూ.320.17 కోట్లు అందజేసింది. కాని ఈసారి ఇప్పటి వరకు రైతులకు రైతు భరోసా అందలేదు. ఈనెలలో రైతు భరోసా రైతులకు ఇచ్చి ఉంటే ఇప్పుడు విత్తన కొనుగోళ్లకు అవకాశం ఉండేది. ఎప్పుడు ఇస్తుందో ఇంకా ప్రభుత్వం ప్రకటించలేదు. ఇకపోతే బ్యాంకుల్లోనైనా రుణాలు అదనంగా ఇచ్చే అవకాశం లేకుండా ఉంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఇదివరకే తీసుకున్న రుణం ఇప్పుడు చెల్లించి రెన్యువల్ చేసుకోవడానికే రైతులు బయట అప్పు తీసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే బ్యాంకుల్లో పంటరుణాలను రెన్యువల్ చేస్తున్నారు. గతేడాది అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నా బీమా ఏదీ రైతుకు అందలేదు. దీంతో పైసల కోసం రైతులు బయట ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

22,184 మంది రిజిస్ట్రేషన్

జిల్లాలో రెండు లక్షలకుపైగా రైతులుంటే అందులో పదో వంతు వరకే విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 78,245 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనమివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సేకరణ ప్రక్రియను కొనసాగిస్తోంది. అదే సమయంలో విత్తనం అవసరమైన రైతులను రిజిస్ట్రేషన్ చేసుకొమ్మని చెప్పింది. ఇప్పటి వరకు జిల్లాలో 22,184 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 19,601 క్వింటాళ్ల విత్తనం దీనికి సరిపోతుంది. ఈనెల 25వ తేదీ నుంచి విత్తన పంపిణీని ప్రారంభిస్తామని ఒకవైపు అధికారులు చెబుతున్నారు. విత్తన కొనుగోళ్లకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. విత్తన కొనుగోళ్లకు ముందుగా డబ్బులు చెల్లించేందుకు ఆర్థిక సమస్యలు కారణమయితే... విత్తన నాణ్యతపైనా రైతుల్లో సందేహాలున్నాయి. దీంతో ప్రభుత్వమిచ్చే సబ్సిడీ విత్తనం కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్నారు.

రైతుకు భరోసానివ్వాలి

రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్నారు. అయితే గతేడాది సరైన పంటలు రైతులకు రాలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం రైతు భరోసాను అందజేయాలి. అది వస్తే విత్తన కొనుగోళ్లు చేసుకోవడంతో పాటు, దుక్కులు దున్నుకునేందుకు అయ్యే ఖర్చులకైనా రైతులకు వస్తాయి. అదే సమయంలో గతేడాది నుంచి వరుసగా ప్రకృతి వైపరిత్యాలతో రైతులు నష్టపోయి ఉన్నారు. వారికి బీమా అందించి ఆదుకోవాలి. ఈ డబ్బులను సీజన్ ప్రారంభానికి ముందే ఇస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

చంద్రశేఖర్‌రెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

'ఉపాధి'పై కేంద్రం దాడి

- ◆ నిబంధనల పేరుతో కూలీల కడుపుకొట్టే కుట్ర
- ◆ 200 రోజుల పని దినాలు కల్పించాలి
- ◆ రోజు కూలి రూ.600 ఇవ్వాలి
- ◆ వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు
- ◆ పుట్టపర్తిలో ఉపాధి కూలీల ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా

మహాధర్నాలో పాల్గొన్న ఉపాధి కూలీలు, వ్యకాసం నాయకులు

ధర్నాలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పుట్టపర్తి కలెక్టరేట్

గ్రామాల్లో పేదలకు అండగా ఉంటూ, కుటుంబ ఆర్థిక అవసరాలకు ఎంతో ఉపయోగంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్నీ నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దుర్మార్గమైన దాడిని కొనసాగిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పరిరక్షణ, కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం నాడు వ్యకాసం ఆధ్వర్యంలో పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద మహాధర్నా కార్యక్రమం చేపట్టారు. ముందుగా జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఉపాధి కూలీలు స్థానిక గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. 'ఉపాధి చట్టాన్ని పరిరక్షించండి.. పని దినాలు పెంచండి.. రోజు కూలి రూ.600 ఇవ్వండి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పెద్దన్న అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లు, బడాబాబులకు రుణమాఫీ చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.600 ఇవ్వడానికి చేతులు రావడం లేదన్నారు. ఈ వేసవిలో మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు వడదెబ్బకు గురై రాష్ట్రవ్యాప్తంగా 58 మంది మతి చెందారన్నారు. వారి కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏటా ఈ పథకానికి లక్షల కోట్లు కేటాయించే ప్రభుత్వం ఈ ఏడాది 33 వేల కోట్లు మాత్రమే మంజూరు చేసిందన్నారు. నిధులు మంజూరు చేయకుండా పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ఇంకో వైపు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి నిధులను పక్కదారి పట్టిస్తూ కూలీల కడుపు కొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఉపాధి పనులపై వ్యవసాయ కార్మిక సంఘం బందాలుగా పర్యటిస్తే కూలీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. పని ప్రదేశాల్లో ఎక్కడా కూలీలకు నిలువనీడలేదన్నారు. నీళ్ల, మెడికల్ కిట్లు అందుబాటులో లేవన్నారు. కూలీలకు తప్పనిసరిగా ఈ వసతులన్నింటినీ కల్పించాలని ఉపాధి హామీ చట్టంలో ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. పనులకు సంబంధించి పే స్లిప్పులు, వారానికి ఒకసారి బిల్లులు ఇవ్వాలన్న నిబంధన కూడా అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. పలు గ్రామాల్లో పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాని పరిస్థితి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి ఉపాధిని నిర్వీర్యం చేసే విధానాలు మాని దానిని మరింత పటిష్టం చేసే చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి కూలీకి 200 రోజుల పనిదినాలు కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. అవసరమైన పనిముట్లు ఇవ్వాలన్నారు. రెండు పూటల పని విధానాన్ని తక్షణం రద్దు చేయాలన్నారు. ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని అమలు చేయరాదన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే కూలీల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కూలీల కోసం పోరాడి తెచ్చుకున్న ఉపాధి చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తే మరో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం ధర్నా చేస్తున్న కూలీల దగ్గరకు డ్వామా పీడీ రామాంజనేయులు వచ్చి సమస్యలను తెలుసుకున్నారు. బుధవారం నాడు ప్రతినిధులు వస్తే చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, జిల్లా నాయకులు రమేష్, పైపల్లి గంగాధర్, వెంకటరమణ, బాలస్వామి, బ్యాళ్ల అంజి, జిల్లా శ్రామిక మహిళా అధ్యక్షురాలు దిల్షాద్‌బీ, సిఐటియు, కెవిపిఎస్ నాయకులు సాంబశివ, లక్ష్మీనారాయణ, వెంకటేష్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి పవన్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన గ్రీవెన్స్‌లో ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అభివృద్ధిపై నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై నిర్లక్ష్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 189 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ డివిజన్, మండల స్థాయి అధికారులతో పలు అంశాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. స్పందన గ్రీవెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. తిరిగి రీ ఓపెనింగ్ గ్రీవెన్స్‌కు రాకుండా పరిష్కరించాలని జిల్లా డివిజన్ స్థాయి అధికారులు ప్రతిరోజు మానిటర్ చేయాలన్నారు. ఈనెల 19న జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో అంగనవాడీ కేంద్రాల పనితీరు, నాడు నేడు పనులు, ప్రాథమిక ఆరోగ్య పనితీరు పరిశీలించి గుర్తించిన సమస్యలను సకాలంలో పరిష్కరించవలసిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉంటుందన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇల్లు ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు గడపగడపకు మన ప్రభుత్వం, సచివాలయాల పనితీరు తదితర పథకాలు వేగవంతం చేయడానికి ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సక్రమంగా పనిచేయని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. పనిలో పురోగతి చూపించాలన్నారు. భోజనం, బాలామృతం పంపిణీలో సక్రమంగా పనిచేయని ఎన్‌పి కుంట అంగన్వాడీ సూపర్వైజర్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఐసిడిఎస్ పీడీని ఆదేశించారు. కదిరి పూల బజార్, లేపాక్షి పరిగి అంగనవాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు లేవని వాటిని చక్కదిద్దాలని ఆదేశించారు. జగనన్న విద్యా కానుక కిట్లను 100 శాతం పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. మే 24వ తేదీ నుంచి జూన్ ఒకటి వరకు జగనన్న ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు 30 కేంద్రాలలో నిర్వహిస్తామని, వాటిని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ పరీక్షల ఆర్ఐఒ సురేష్ బాబు, డిఎంఅండ్‌హెచ్ఒ కృష్ణారెడ్డి, డిఇఒ మీనాక్షి, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ సూర్యనారాయణ, ఆర్టీసీ డిఎం ఇనయతుల్లా, ఫైర్ అధికారి శంకర ప్రసాద్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అడ్డుకోవాలి

మడకశిర రూరల్ : ప్రభుత్వ జీఓలకి రక్షణ కల్పించి, లా అండ్ ఆర్డర్‌ను కాపాడాలని కోరుతూ సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ బాలాంజనేయులు, సిఐ సురేష్‌బాబుకి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ జీఓలు గ్రామస్థాయిలో ఏ మేరకు అమలవుతున్నాయో గ్రామ/వార్డు సచివాల యం, వాలంటీర్ల ద్వారా పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కదిరే పల్లిలోని ఓ ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం ముందస్తు అడ్మిషన్లకు పాల్పడడంతో పాటు అధిక ఫీజులు వసూలు చేయడం దారుణమన్నారు. విద్యాశాఖ అధికారులు ముందస్తు అడ్మిషన్లను అడ్డుకోకపోతే ఆ పాఠశాల ముందు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అలాగే ముందస్తు అడ్మిషన్లు, ప్రచారం చేస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మభ్య పెడుతున్న ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్, నాయకులు నరేంద్ర, అనిల్ ఉన్నారు.

విషాదం..!

ప్రాణంతీసిన ఈతసరదా

అనంత జిల్లాలో ఇద్దరు, సత్యసాయి జిల్లాలో ఒకరు మృతి

మృతి చెందిన చిన్నారులు... రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-శింగనమల, ధర్మవరం టౌన్

ఈత సరదా ముగ్గురి ప్రాణాలను బలిగొంది. అనంతపురం జిల్లా శింగనమల మండలం పెద్దజలాలపురంలో ఇద్దరు చిన్నారులు, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఒక సిఎ విద్యార్థి నీటిలో మునిగి శనివారం నాడు మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం మిగిలింది.

పెద్దజలాలపురం నడిమివంకలో పడి ఇద్దరు చిన్నారులు..

శింగమల మండలం పెద్దజలాలపురం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కడప జిల్లా కొండాపురం మండలం ధర్మాల గ్రామానికి చెందిన సరస్వతి కుమారుడు బాలు(16), అదే గ్రామానికి చెందిన ఈమె అన్న కుమారుడు హేమాద్రి(10)లు పెద్దజలాలపురం గ్రామంలోని సరస్వతి బంధువు గొల్ల రామచంద్రారెడ్డి ఇంటికి వేసవి సెలవుల నిమిత్తం వచ్చారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో గ్రామ సమీపంలోని కూతలేరు వంకలోకి సరస్వతి మరో మహిళతో కలిసి బట్టలు ఉతికేందుకు వెళ్లారు. వీరితో పాటు బాలు, హేమాద్రి కూడా వెళ్లారు. మహిళలు బట్టలు ఉతుకుతుండగా ఈ పిల్లలు ఇద్దరు ఈతకోసం వంకలోకి దిగారు. వంకలో నీటి లోతు ఎక్కువగా ఉండడంతో హేమాద్రి అందులో మునిగిపోయాడు. ఈ బాలున్ని రక్షించేందుకు బాలు వెళ్లాడు. నీటిలోతు ఎక్కువగా ఉండడంతో ఇద్దరు చిన్నారులు అందులో మునిగిపోయారు. గట్టున ఉన్న మహిళలు చూస్తుండగానే ఇద్దరూ మునిగిపోయారు. దీంతో వారు పెద్ద ఎత్తున కేకలు వేశారు. అటుగా వెళ్తున్న వారు గుర్తించి నీటిలో దిగి చిన్నారుల కోసం వెతికారు. నీటి అడుగున ఉన్న వారిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సరదాగా నీటిలో ఈతకొడుతున్న ఇద్దరు పిల్లలు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మవరంలో సిఎ విద్యార్థి...

వెంకటేష్ (ఫైల్‌ఫొటో)

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని పోతుకుంట గ్రామం వద్ద వున్న వ్యవసాయ తోటలో సోమవారం సరదాగా ఈతకు వెళ్లిన వెంకటేష్ (23) అనే విద్యార్థి నీటి మునిగి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన లక్ష్మిదేవి, శ్రీనివాసులు దంపతుల కుమారుడు వెంకటేష్ గుంటూరులోని ఓ ప్రవేటు కళాశాలలో సిఎ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లాడు. అయితే ప్రమాదపు శాత్తు నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. రూరల్ పోలీసులతో పాటు ఫైర్ ఆఫీసర్ రాజు తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. మగ్గం పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్న కుటుంబ సభ్యులు వచ్చిన ఆదాయంతో కుమారుడిని బాగా చదివించుకుంటున్నారు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు బస్సుసౌకర్యం కల్పించాలి

రొద్దం: మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రొద్దంలోని కళాశాలలు, పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ప్రభుత్వం బస్సు సౌకర్యం కల్పించాల ని కోరుతూ సోమవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులకు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని దొడగట్ట నుంచి రెడ్డిపల్లి, గోనిమేకలపల్లి, పెద్దగువ్వలపల్లి మీదుగా రొద్దం కళాశాల వరకు మడకశిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులా నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. అనంతరం ఎంపిపి చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే హిందూపురం, మడకశిర పట్టణాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పెద్దగువ్వలపల్లి విష్ణు, శ్రీనివాసులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై నేడు టిడిపి నిరసన

గోరంట్ల : రాష్ట్రంలో ఇటీవల పెరిగిన అనధికార విద్యుత్ కోతలు, విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా మంగళవారం (నేడు) పట్టణంలోని సబ్ స్టేషన్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు మండల టిడిపి కన్వీనర్ సోమశేఖర్ సోమవారం తెలిపారు. కావున నిరసన కార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంహెచ్ఓ మంజువాణి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ మంజువాణి

రొద్దం: ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ మంజువాణి సూచించారు. మండల పరిధిలోని తురకలాపట్నం సబ్ సెంటర్‌ను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రోగులకు అందుతున్న సేవలపై సబ్ సెంటర్ సిబ్బంది గౌతమి, సచివాలయ ఏఎన్ఎం ఈశ్వరమ్మలను అడిగి తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. అలాగే అక్కడ చికిత్స పొందుతున్న రోగులను విచారించి సలహా లు, సూచనలు ఇచ్చారు. ఆ తర్వాత రొద్దం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టికను, ఫార్మసీ గదిలోని మందులను పరిశీలించారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాల ఐఎల్ఆర్ డీప్ ఫ్రిజ్లను, కాన్పుల గదిని తనిఖీ చేశారు. ఆర్‌సిహెచ్, ఎన్సీడీసీడీ వంద శాతం అయ్యేలా చూసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం అక్కడున్న రోగులతో మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని దైనందిక కార్యక్రమాలు తొందరగా పూర్తి చేసుకుని చల్లటి ప్రదేశాల్లో ఉండాలన్నారు. ఆమెతో పాటు డాక్టర్ జగదీష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

గిరిజన బాలికల గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోరంట్ల : పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఈ ఏడాది విద్యా సంవత్సరానికి విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ విజయ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లు ఉన్నాయన్నారు. 3వ తరగతికి 40, 4వ తరగతికి 35, ఐదో తరగతికి 20, ఆరో తరగతికి 20, 8వ తరగతికి 7, 9వ తరగతికి 2 సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 6 తేదీ లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు

24న బహిరంగ వేలం

అమడగూరు : కదిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వచ్చిన బియ్యం, ఖాళీ రేకు డబ్బాలు ఈ నెల 24న వేలం వేయనున్నట్లు ఆలయ ఈవో గురు ప్రసాద్, పాలకమండలి చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. వేలంలో పాల్గొనువారి బియ్యం కోసం రూ. 50 వేలు, డబ్బాల కోసం నిర్ణయించిన వేలం పాటలో పాల్గొనే వారు రూ. 5వేలు డిపాజిట్ చేయాలని వారు తెలిపారు.

ఆలయ నూతన కమిటీ ఏర్పాటు

హిందూపురం : పట్టణంలోని ఐదు లాంతర్ల గాంధీ సర్కిల్ వద్ద నూతనంగా నిర్మించనున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ నూతన కమిటీని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ మేరకు నూతన కమిటీ మెయిన్ బజార్ లోని శ్రీ జలధర్మప్ప ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులుగా జెజి వెంకటస్వామి, అధ్యక్షులుగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షులుగా టివి రామాంజనేయులు, అంబికా రఘునాథ్, కార్యదర్శిగా నిమ్మకాయల రాము, సంయుక్త కార్యదర్శిగా సూర్యనారాయణ, కోశాధికారిగా సుధాకర్, డైరెక్టర్లుగా శ్రీకాంత్, చంద్రమోహన్, అమర్నాథ్, నెట్టప్ప, సూర్యనారాయణ, మునిరాజ్, బాలాజీ, రాజేష్, నాగన్న, టీవీ వెంకటేష్, కె మంజులను ఎంపిక చేశారు.

ఆర్‌బికెలకు చేరిన సబ్సిడీ వేరుశనగ

కొత్తచెరువు : ఖరీఫ్ లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు సబ్సిడీతో పంపిణీ చేయనున్న విత్తన వేరుశనగ ఆర్‌బికెలకు చేరాయని ఏఒ నటరాజు తెలిపారు. వేరుశనగ కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం ఆధార్ కార్డ్ మొబైల్ ఫోన్‌ను ఆర్‌బికెకు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మైలసముద్రం, నాగిరెడ్డిపల్లి, లోచర్ల ఆర్‌బికెలకు 300 క్వింటాళ్ల విత్తన వేరుశనగ దిగుమతి అయిందని ఆయన చెప్పారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

అమడగూరు : కదిరి రూరల్ మండలం ముత్యాలచెరువు గ్రామం, చిగురుమాను తండా నుంచి కొత్తపల్లి సమీపంలో నిర్మిస్తున్న శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి విరాళం అందజేశారు. 50 వేల రూపాయలను స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

కొత్తచెరువు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ అధికారి కె జయరాం తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో 15 రోజులుగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, ఆటల పోటీలు, డ్రాయింగ్ వేయించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్, వెంకటరమణప్ప, రమేష్, రామాచారి, రాఘవ, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

25న రిలే నిరాహార దీక్ష

అమడగూరు : ప్రభుత్వ ఉద్యోగుల సమస్య పరిష్కారానికై ఎపిజెఎసి పిలుపుమేరకు, చేపట్టిన రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని ప్రభుత్వ ఉద్యోగులు కదిరి తాలూకా అధ్యక్షుడు ఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు. సోమవారం కదిరిలోని పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ తో ఈనెల 25వ తేదీన కదిరిలోనిమున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ప్రభుత్వ ఉద్యోగులందరూ తమ వంతు సంఘీభావాన్ని తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఆత్మనంద రెడ్డికమిటీ సభ్యులు నాగమణి, రామాంజనేయులు హరిప్రసాద్, వలసలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య అవార్డుకు కల్లూరు రాఘవేంద్రరావు ఎంపిక

హిందూపురం: కవి, రచయిత, తెలుగు భాషా ఉద్యమ నేత కల్లూరు రాఘవేంద్రరావును కల్లూరు సుబ్బారావు సాహిత్య అవార్డుకు ఎంపిక చేస్తూ నిర్వాహకులు సోమవారం ఉత్తర్వులు పంపారు. కల్లూరు సుబ్బారావు జీవిత చరిత్రను పుస్తక స్థాయిలో రచించడంతో ఈ అవార్డు అభించినట్లు ఆయన చెప్పారు. ఈ నెల 25 కల్లూరు సుబ్బారావు జయంతి సందర్భంగా అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో జరిగే కార్యక్రమానికి వచ్చి అవార్డు అందుకోవాలని లేఖలో సూచించినట్లు రాఘవేంద్రరావు తెలిపారు.

వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోవాలి

హిందూపురం : గ్రామ స్థాయిలో విలేజ్ క్లినిక్ లో విధులు నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్లు ఎప్పటికప్పుడు వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎన్‌సిడి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింగరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా అసుపత్రిలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణకు ముఖ్యఅతిథులుగా జేడీ నరసింగరావు, డీఎంఅండ్ హెచ్ఒ ఎస్వీ కృష్ణారెడ్డి, డిపిఎంఒ చిన్నకుళ్లాయప్ప నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ నాగరాజు నాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పిలకు ప్రాధాన్యత కల్పిస్తూ అవసరం మేరకు పలురకాల శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తోందన్నారు. శిక్షణలో అన్ని అంశాలను తెలుసుకుని ఉత్తమ సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఒ డాక్టర్ సురేష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్, హెడ్ నర్సులు, శిక్షకులు పి.అరుణ, అమర ప్రియ, వనిత, రెడ్డికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను వెంటనే పూర్తి చేయాలి

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా భవనములు, వాణిజ్య భవనాలు, ఖాళీ స్థలాలకు సంబందించిన రీ సర్వేను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్, ప్లానింగ్ సెక్రటరీలు, విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు పురపాలక సంఘ వ్యాప్తంగా 16ఎ, 16ఎఎ పై సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. ఈ సర్వేను ఈ నెల 30వ తేదిలోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎసిపి ఆనంద్ కుమార్, అధికారులు సుధాకర్, రాము, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు పురస్కారాలు ప్రదానం

గోరంట్ల : స్థానిక ఎస్ఎల్‌వి ఫంక్షన్ హాలులో సోమవారం గ్రామ వాలంటీర్లకు ఎమ్మెల్యే శంకర నారాయణ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వాలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి ప్రతి 50 ఇళ్లకు ఓ వాలంటీర్ చొప్పున ఏర్పాటు చేసిందన్నారు. వాలంటీర్లు రాజకీయాలకు అతీతం గా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వారి సేవలను ప్రభుత్వం గుర్తించి సేవా పురస్కారాలు అందజేస్తుందన్నారు. వాలంటీర్లు ప్రజలకు మరింత చేరవై సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా, ఎంపిపి ప్రమీల, జడ్పిటిసి జయరాం నాయక్, సచివాలయ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సర్పంచిలు, ఎంపిటిసిలు, వాలంటీర్లు, సచివాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పని కల్పిస్తాం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరంలో చేనేత కార్మికులందరికి తప్పనిసరిగా మగ్గంపని కల్పిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డిప్యూటి డైరెక్టర్ రాజారావు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆయన సమావేశాన్ని ఏర్పాటుచేసి పలు విషయాలను ఆర్డీవో తిప్పేనాయక్‌కు తెలిపారు. పట్టణంలో ఏ ఒక్క చేనేత కార్మికుడు కూడా పనిలేదన్న ఫిర్యాదు ఇవ్వకుండా వారి జీవనోపాధికి కృషిచేయాలన్నారు. చేనేత కార్మికుల జీవన పరిస్థితి కొంతకష్టతరంగా ఉన్నది వాస్తవమేనని, వాటిని దృష్టిలో ఉంచుకుని ప్రతి చేనేతకార్మికునికి పని కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలను పట్టణంలోని ఏడీలకు ఆదేశాలిచ్చామన్నారు. పవర్‌లూమ్స్‌పై ఇప్పటివరకు దాడులు జరుగుతున్నాయని, చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మహేశ్వరరెడ్డిరెడ్డి ఎడిఒ శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో సమావేశమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఈదురుగాలులకు నేలకొరిగిన అరటి

నేలకొరిగిన అరటిపంటను చూపుతున్న రైతు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఆదివారం సాయంత్రం వీచిన గాలివానకు మండల పరిధిలో పలు గ్రామాల్లో ఆస్తినష్టం జరిగింది. మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన రైతు రామక్రిష్ణా రెడ్డికి చెందిన 2 ఎకరాల మేర అరటి తోట నేలకొరిగింది. దీంతో తనకు 2లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు రామక్రిష్ణారెడ్డి వాపోయారు. విషయం తెలుసుకున్న వీఆర్వో శ్రీనివాసులు,అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్ తదితరులు పంటనష్టం అయిన పొలాన్ని పరిశీలించారు. పంట చేతికందే సమయంలో ఊహించని నష్టం కలగడంతో రైతు రామక్రిష్ణా రెడ్డి ఆందోళన వ్యక్తం చేశాడు. తనకు జరిగిన నష్టానికి ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

ధర్మవరం టౌన్ : మండలంలోని రేగాటిపల్లిలోని రైతు చిలకం సూర్యనారాయణరెడ్డికి చెందిన అరటిపంట ఈదురుగాలులకు నేలకొరిగింది. దీంతో అరటిపంట పూర్తిగా కోల్పోయి దాదాపు రూ.5లక్షలకు పైగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతు సూర్యనారాయణరెడ్డి గత నాలుగేళ్ల నుండి నష్టాలను చవిచూస్తున్నాడు. న్నో వ్యవప్రయాసాలకోర్చి లక్షల రూపాయల్లో పెట్టుబడి పెట్టి మంచి దిగుబడులు సాధించినా పంట చేతికి వచ్చేసరికి ఏదో రూపంలో నష్టపోతున్నాడు. రెండేళ్ల వ్యవధిలోనే రూ.15 లక్షల దాకా నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. గత ఏడాది అరటి, దోశవంటిపంటలు సాగుచేయగా మంచి దిగుబడుల సమయంలో తెగుళ్లు సోకి చివరికి పంటను వదిలేయాల్సి వచ్చింది. అప్పట్లో రూ.7లక్షల దాకా నష్టపోయినట్లు బాధిత రైతు తెలిపారు. ఈ సారైన మంచి దిగుబడులు సాధించి చేసిన అప్పులు తీర్చాలని శ్రమించి అందుకు తగ్గ దిగుబడులు తీసుకువచ్చినప్పటికి మరో నెలలో కోత దశకు వస్తుందన్న అరటిపంట ఆదివారం రాత్రి ఈదురుగాలులకు నేలకొరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

నకిలీ ధ్రువపత్రాలు జారీ చేస్తున్న సెంటర్‌పై చర్యలకు డిమాండ్

అమడగూరు : కదిరి పట్టణంలోనా వేమారెడ్డి సర్కిల్లో ఉన్న కెఎస్‌ఆర్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్లో నకలి సర్టిఫికెట్లు విక్రయిస్తున్నారని ఈ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహాశీల్దార్‌కు సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కంప్యూటర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు విద్యార్థుల దగ్గర నుండి ఒక్కొక్క సర్టిఫికెట్‌కు రూ 6వేల నుంచి 8వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కేవలం డబ్బు కోసం విద్యార్థులను, యువతను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుభవం లేని వ్యక్తికి ఎనిమిది వేల రూపాయలకి కోర్సులను కంప్లీట్ చేసినట్లు ఫేక్ సర్టిఫికెట్ ఇచ్చారన్నారు. అది కూడా సంవత్సరం కిందట ఈ కోర్సు పూర్తి చేసినట్లు సర్టిఫికెట్‌ను ఇచ్చారని ఆరోపించారు. చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కెఎస్‌ఆర్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌ను సీజ్ చేసి నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ కుమార్, కదిరి నియోజకవర్గ కార్యదర్శి గుజ్జల రాజేష్, మణి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఎంపీని అరెస్టు చేయండి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మహిళ రెజ్లర్లపై లైంగిక దాడులకు పాల్పడిన బిజెపి ప్రతినిధులను వెంటనే అరెస్టు చేయాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. సోమవారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ముందు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సమైక్య కార్యదర్శి జయమ్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ దేశానికి పేరు ప్రతిష్టలు తెచ్చిన మహిళ రెజ్లర్ల పై దేశ రాజధాని ఢిల్లీ లో బిజెపి నాయకులు దాడులకు లైంగిక వేధింపులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. సంఘటన జరిగి 15 రోజులు అవుతున్న నిందితులపై చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆ సంఘటనకు పాల్పడిన బిజెపి ఎంపీనిపార్టీ నుంచి సస్పెండ్ చేసి అతని అనుచరులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, మహిళా సమైక్య నాయకురాళ్లు లక్ష్మి, ఈశ్వరమ్మ, యశోద, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికే విషసంస్కృతిని ఆపండి : పరిటాల శ్రీరామ్

ధ్వంసం చేసిన బోరుబావిని పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్, తదితరులు

ప్రజాశక్తి బత్తలపల్లి

గ్రామాల్లో చెట్లు నరకడం, బోర్లు పూడ్చడం వంటి సంస్కృతి తిమ్మంపల్లి వైపు నుంచే వచ్చిందని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ విమర్శించారు. తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామానికి చెందిన కప్పల గంగయ్యకు చెందిన బోరుబావిని స్థానికంగా ఉన్న అధికారపార్టీ నాయకులు పూడ్చివేశారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. గ్రామ సమీపంలో గంగయ్యకు 1500 చీనీ చెట్లు ఉన్న తోట ఉండగా 19వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బోరుబావిని పూడ్చివేశారు. దీనివలన బోరు సామాగ్రి తో పాటు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్ సోమవారం గ్రామానికి వెళ్లి బాధిత రైతును పరామర్శించారు. పూడ్చిన బోరును పరిశీలించారు. ఈనెల 18వ తేదీన గంగయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి పరిటాల శ్రీరామ్ సమక్షంలో తెలుగు దేశం పార్టీలో చేరారు. ఆ తర్వాత రోజే ఈ సంఘటన జరిగినట్లు బాధితులు వాపోయారు. ఈ సంఘటనపై పరిటాల శ్రీరామ్ తీవ్రంగా స్పందించారు. గ్రామాల్లో ఏవైనా రాజకీయంగా గొడవలు ఉంటే రాజకీయంగానే చూసుకోవాలి కానీ ఇలా పచ్చని చెట్లకు ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరించడం తగదన్నారు. గతంలో ఈ గ్రామానికి సమీపంలో ఉన్న యల్లనూరు పుట్లూరు మండలాల్లో ఇలాంటి సంస్కృతి ఉండేదని దానికి ఎవరు ఆజ్యం పోశారో అందరికీ తెలుసునని అన్నారు. ఇప్పుడు మళ్లీ అదే సంస్కృతి పడగలు విప్పడం ఆందోళనకరమన్నారు. రైతులకు నష్టం కలిగించే విధంగా ఉన్న ఈ విష సంస్కృతిని ఆదిలోనే తుంచి వేయాలని సూచించారు. ఇప్పటికైనా ఇలాంటి వాటికి ముగింపు పలకాలని లేకుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

సకాలంలో రీ సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జెసి

జిల్లాలో 54 గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి ఆర్డీవోలు, తహాశీల్దార్లు, డిఐఎస్‌లు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన 54 గ్రామాల్లో గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం రీ సర్వేకి 90 రోజులు గడువు ఇచ్చిందని ఆలోపుల పూర్తి చేయాలని అన్నారు. ఆయా గ్రామాల్లో గ్రౌండ్ టు థింక్ తదితర డ్రాప్ ల్యాండ్ రిజిస్టర్ ను కూడా వేగంగా పూర్తి చేయాలన్నారు. వెనుకబడిన గ్రామాల్లో ల్యాండ్ రికార్డులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కొండయ్య, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఎడి రామకృష్ణ, తహాశీల్దార్ క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పునరావృతం కానీయొద్దు : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ

స్పందన కార్యక్రమంలో వచ్చు ఫిర్యాదులను తక్షణం పరిష్కరించి వాటిని పునరావృతం కాకుండా చూడాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం లో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ ప్రతి పిటిషనర్ తో మాట్లాడి వారి సమస్య గురించి అడిగి తెలుసుకొని సంబంధిత స్టేషన్ సిబ్బందికి ఫోన్ చేసి సమస్య త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందన పిటిషన్లలో ఎక్కువగా రస్తా వివాదాలు, కుటుంబ కలహాలు, అదనపు కట్నం కోసం భర్త, అత్తారింటి వేధింపులు, ఉద్యోగ మోసాలు, భూవివాదాలు, ఆర్థికమోసాలు తదితర వాటి గురించి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, సిఐ రవీందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి పాలనలో చేనేత కుదేలు : జనసేన

స్థానికులతో మాట్లాడుతున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వైసిపి అధికారంలోకి వచ్చాన ధర్మవరంలో చేనేత పరిశ్రమ కుదేలు అయ్యిందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 15వ వార్డులోని నేసేపేటలో ఆయన సేవ్ ధర్మవరం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో చేనేత పరిశ్రమకు ఒక గుర్తింపు ఉండేదని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చేనేత పరిశ్రమ భ్రష్టుపట్టిందని అన్నారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతోపాటు నేసిన చీరకు గిట్టుబాటు ధర లేక నేతన్నలు చివరికి ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలను పరామర్శించకపోగా ఇంతవరకు ఒక్కరూపాయి కూడా ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. అదేవిధంగా మైనార్టీ, బీసీ, ఎస్సీఎస్టీ వర్గాలను సైతం వైసీపీ మోసం చేసిందన్నారు. ధర్మవరంలో రౌడీరాజ్యాన్ని పొగొట్టడానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

ధర్నాను జయప్రదం చేయండి

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ఆటో కార్మికు సమస్యలపై కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున ఆటో కార్మికులు పాల్గొనిజయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప కోరారు. సోమవారం పట్టణంలోని కల్లూరు ఆటో స్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, కొటిపి ఆటోస్టాండ్, వివిధ ఆటో స్టాండ్‌లలో ధర్నాకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, ఆటో యూనియన్ పట్టణ కార్యదర్శి అత్తర్ బాబా, మోదస్టాండ్ సురేష్ బాలు, ఆర్టీసీ బస్టాండ్ అంజనప్ప, రామాంజి, మధు, కొటిపి ఆటోస్టాండ్ గంగప్ప, రమేష్, నాగరాజు, రెహమాన్, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: ట్రాన్స్‌పోర్టు రంగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఈనెల 23న నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆటో యూనియన్ నాయకులు బాబావలి కోరారు. ఈ సందర్భంగా పెడపల్లి బస్టాండ్‌వద్ద సోమవారం ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం బాబావలి మాట్లాడుతూ ఆటో కార్మికులపై పోలీసులు వేధింపులు ఆపాలని, ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు సుహెల్‌బాషా, చలపతి, దాదా పీర్, బాబ్జాన్, నాగేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కర్నాటక మద్యం పట్టివేత

లేపాక్షి: మండల పరిధిలోని చోళసముద్రం గ్రామం వద్ద సోమవారం కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సోమవారం చోళసముద్రం గ్రామ సమీపంలో ఎస్ఐ పోలీసుతో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై అక్రమంగా కర్నాటక మద్యం తరలిన్నట్లు గుర్తించి మద్యం బాటిళ్లతో పాటు టెట్రా పాకెట్లు, ద్విచక్ర వాహనం సీజ్ చేశారు. అలాగే కేసు నమోదు చేసి అతడిని కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

లేపాక్షి: మండల పరిధిలోని పులమతి గ్రామంలో సోమవారం రామాంజనప్ప కుమారుడు మాల మహేష్(37) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనప్ప, శారదమ్మ దంపతులకు కొడుకు మహేష్‌తో పాటు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్యాభర్తలు కూతుళ్లతో కలిసి కర్నాటకలో వివాహానికి హాజరై సోమవారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా మహేష్ ఉరి వేసుకుని ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

హిందూపురం : రూరల్ మండలం కొటిపి పంచాయితీ బసవేశ్వర కాలనీలో రెండు నెలల క్రితం జరిగిన మహిళా హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సిఐ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడించారు. గత మార్చి 15న కుటుంబ కలహాలతో హత్యకు గురైన సరస్వతి హత్య కేసులో తల్లి సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. విచారణలో వెల్లడైన హత్య కేసు నిందితుడు అజీముద్దీన్ అలియాస్ అజీమ్‌ను పరగి బస్టాండ్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ చెప్పారు.

ధర్మవరంలో వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

జర్నలిస్టులపై దాడిచేసిన వారిని శిక్షించాలి

పుట్టపర్తి రూరల్: హైదరాబాదులో జర్నలిస్టులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని శ్రీ సత్య సాయి జిల్లా జర్నలిస్టు యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక ఎస్పీ మాధవ రెడ్డికి, కలెక్టర్ అరుణ్‌బాబుకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. వారి వాహనాలను ధ్వంసం చేయడం చట్ట వ్యతిరేక చర్య అని అన్నారు. . ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చట్టాలను కఠినతరం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల సంఘం నాయకులు శ్రీనివాసులు, పుల్లయ్య, మురళి, రంగారెడ్డి, కుల్లాయప్ప, హరి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : న్యూస్ కవరేజ్ కోసం వెళ్ళి జర్నలిస్టులపై ప్రత్యక్షంగా దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ధర్మవరంప్రెస్ క్లబ్ కమిటీ వన్ టౌన్ సీఐ సుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సోమవారం ధర్మవరం ప్రెస్ క్లబ్ కమిటి అధ్యక్షుడు జానపాటిమోహన్, ప్రధానకార్యదర్శి మురళీ, సభ్యులు సీఐసుబ్రమణ్యంను కలిసి జర్నలిస్టులపై దాడులు చేస్తున్న వారిపై కఠినంగా శిక్షించాలని కోరారు. నాలుగు రోజుల క్రితం ఎంపీ అవివా రెడ్డిని సీబీఐ అరెస్టుచేస్తుందన్న సమాచారంతో న్యూస్ కవరేజ్ చేసేందుకు వెళ్లిన ప్రతినిధులపై దాడిచేసి వాహనాన్ని ధ్వంసం చేయడం ఆమానుషమన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు పతకమూరి నాగభూషణ, రమేష్‌నాయుడు, గుండారాఘవ, సుబ్బు, కల్యాణ్, రాజా, రమణ, గోవర్ధన్ రెడ్డి, దొడ్డప్ప,నరసింహులు ఉన్నారు.

పెడపల్లిలో పిడుగుపాటు

పుట్టపర్తి రూరల్: ఆదివారం రాత్రి గాలివాన వచ్చిన సమయంలో పెడపల్లి ఎస్సీ కాలనీలో పిడుగు పడింది. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. ఎస్సీ కాలనీలోని నరసింహులు ఇంటి సమీపంలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు నిలువునా కాలిపోయింది. నరసింహులు ఇంట్లో పిల్లలు చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు.

పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి

హిందూపురం : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉన్నా అన్ని విద్యా సంస్థల బస్సులకు రవాణ శాఖ ఇచ్చే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పని సరిగా ఉండాలని రవాణాశాఖ అధికారి రమణ తెలిపారు. సోమవారం స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో వివిధ విద్యాసంస్థలకు చెందిన బస్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వాహనాలను స్వయంగా నడిపి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రవాణ శాఖ అధికారులు ఎస్. శివ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్‌కు సేవామిత్ర అవార్డు

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని పాలసముద్రం గ్రామానికి చెందిన వాలంటీర్ చంద్రశేఖర్‌రెడ్డికి ముచ్చటగా మూడోసారి సేవా మిత్ర అవార్డు లభించింది. అవార్డు దక్కడంపై పాలసముద్రం సర్పంచి గంగప్ప, ఎంపిపి ప్రమీలమూర్తి, సచివాలయ కన్వీనర్ గోవింద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డును వందనం కార్యక్రమంలో భాగంగా పెనుగొండ ఎమ్మెల్యే శంకరనారాయణ నుంచి అందుకున్నారు. చంద్రశేఖర్ రెడ్డికి ఎంపిడిఒ రఘునాథగుప్త, వైసిపి నాయకులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పలువురు అభినందనలు తెలిపారు.

ఆర్‌బికెలో పేర్లు నమోదు చేసుకోండి

లేపాక్షి : ఖరీఫ్ 2023-24కి సంబంధించి మండలంలో కె-6 రకం విత్తన వేరుశనగ కాయలను 1,002 క్వింటాళ్లు నిల్వ చేశామని సోమవారం ఏఓ శ్రీలత తెలిపారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తన వేరుశనగ అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు ఆర్‌బికెలలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సర్పంచి ఆదినారాయణ లేపాక్షి-3 రైతు భరోసా కేంద్రంలో విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ పుష్ప లత, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల : విత్తన వేరుశనగ కాయల కోసం రైతులు స్థానిక ఆర్‌బికెలలో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజ్యలక్ష్మి సూచించారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం తీసుకుని రావాలన్నారు. 40 శాతం రాయితీ పోనూ రైతు ఒక బ్యాగుకు రూ. 1675 చెల్లించాలని తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో సిసి రోడ్డు నిర్మాణం

మడకశిర రూరల్ : మడకశిర నగర పంచాయతీలోని ఆరేపేటలో రోడ్డు గుంతలమయం కావడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు సిసి రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ కుమారుడు జయరాజ్ అధికారులతో కలిసి సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే తిప్పేస్వామి సహకారంతో మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ధర్మవరం టౌన్ : అనంతపురం ఆర్డీటీ కార్యాలయం సమీపంలోగల నసనకోట ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ విరాళం అందజేశారు. రూ.1.00.116లను ఆలయ నిర్వాహకురాలికి సోమవారం అనంతపురంలోని తన స్వగృహంలో అందజేశారు. నగదును ఆలయ నిర్వాహకురాలు పార్వతమ్మకు అందజేశారు.